
సాక్షి
బాపట్ల
మంగళవారం । 22 । జూలై । 2025



ఆషాఢ సారె సమర్పణ

నరసరావుపేటఈస్ట్: ఆషాఢ మాసం పురస్కరించుకొని నరసరావుపేట శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి భక్తులు సోమవారం సారె సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 568.30 అడుగులకు చేరింది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. నగరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి.

నమ్మండి..కాల్వలేనండీ

- పూడికతో నిండిన కృష్ణా, సాగర్ కాలువలు
- గుర్రపు డెక్క, తూటికాడతో నిండిన వైనం
- రేపల్లె, వేమూరు, బాపట్ల పరిధిలో మరింత అధ్వానం
- ఏడాదిగా పట్టించుకోని అధికారులు
- రైతుల మొర ఆలకించని వైనం
- ఇప్పుడిప్పుడే కాలువలకు చేరుకుంటున్న నీరు
- ఈ స్థితిలో కాలువల నుంచి పంటలకు నీరందడం సాధ్యం కాదంటున్న రైతులు

తీవ్ర నిర్లక్ష్యం బారిన పంట కాల్వలు



తూటికాడ, గుర్రపు డెక్కతో నిండిన రేపల్లె నియోజకవర్గంలోని ఆర్ఎం డ్రెయిన్



రేపల్లె వాడమురుగు డ్రెయిన్ దుస్థితి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఆది నుంచి చంద్రబాబుకు రైతులన్నా.. వ్యవసాయమన్నా గిట్టదు. వ్యవసాయం దండగని కూడా ఆయన వ్యాఖ్యానించడం అందరికీ తెలిసిందే. బాబు తన పాలనలో సాగు నీటి పథకాలను చిన్నచూపు చూశారు. పెండింగ్‌లో ఉన్న నీటి పథకాలకు బడ్జెట్‌లో పైసా నిధులు విదిల్చిన పాపాన పోలేదు. ఆయన ఏనాడూ అన్నదాతల కష్టాలను కనలేదు, వారి బాధలను వినలేదు. చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి అయినా రైతన్నల కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు. సాగుకు అవసరమైన ప్రోత్సాహాలను అందించే ప్రయత్నమూ చేయలేదు. అన్నదాత సుఖీభవ ఇంతవరకు ఇవ్వనేలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర సైతం లేదు. ఏడాదిగా అధికారంలోవున్నా... కూటమి పాలకులు జిల్లాలోని కృష్ణా, నాగార్జున సాగర్ ప్రధాన కాలువల పరిధిలోని పంటకాలువల ఆధునికీకరణ పనులను పట్టించుకోలేదు. ఖరీఫ్ ప్రారంభమై ఒకవైపు నీటిని విడుదల చేస్తున్నా జిల్లావ్యాప్తంగా వున్న కాలువల్లోని పూడికతీత పనులను పూర్తిచేయలేదు.

గుర్రపు డెక్క.. తూటికాడ

వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలంలో గంగోలు కాలువలో మూడు కిలోమీటర్ల మేర గుర్రపు డెక్కతోపాటు తూటికాడ మరింతగా పెరిగి పోయింది. నియోజకవర్గంలోని వేమూరు మండలం జంపని డ్రైన్‌తోపాటు అన్నికాలువల్లో ఇదే పరిస్థితి. కాలువలు పూడికతో పనికిరాకుండా పోయాయి. ఆదివారం మండలంలోని చంపాడు వద్ద కాలువలోని తూటికాడలో ఇరుక్కొని పోతుమర్రి గ్రామ రైతుకు చెందిన మూడు గేదెలు మృతి చెందినట్లు తెలుస్తోంది.

- రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పరిధిలోని వాడమురుగు డ్రెయిన్, జగజ్జేరు కాలువ, రేపల్లె ఓల్డుకోర్సు, న్యూకోర్సు, ఆర్ఎం డ్రెయిన్, బీఎం డ్రెయిన్‌లలో పూడికతోపాటు గుర్రపు డెక్క, తూటికాడ మరింతగా పెరిగి పోయింది. కాలువలకు నీటిని విడుదల చేసినా సక్రమంగా పంటలకు చేరే పరిస్థితి లేదు.
- బాపట్ల నియోజకవర్గంలో తూరుపు శాంప్, నల్లమడ, తుంగభద్ర, భీమునికుంటవాగు, మరుప్రోలు వారిపాలెం స్ట్రెయిట్‌కట్ తదితర ప్రధాన కాలువలతోపాటు వాటి పరిధిలోని పంటకాలువలు మొత్తం పూడిక, తూటికాడ, గుర్రెపుడెక్క, నాచుతో నిండిపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదు.
- అద్దంకి నియోజకవర్గం పరిధిలో సంతమాగులూరు మొదలుకొని కొరిశపాడు మండలం పమిడిపాడు వరకు సాగర్‌కు సంబంధించి అద్దంకి బ్రాంచ్ కెనాల్ వుంది. పర్చూరు ప్రాంతంలోని పర్చూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని సాగర్ కాలువల పరిధిలో కొంతమేర కాలువ పూడిక తీత లైనింగ్ పనులు చేసినా మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు కాలువల్లో డ్రాపుల రిపేరు పనులను ప్రభుత్వం పట్టించుకోలేదు. చీరాల నియోజకవర్గ పరిధిలోనూ కాలువల ఆధునికీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చివరి ఆయకట్టులో పూడికతీత పనులనూ ప్రభుత్వం పట్టించుకోలేదు.

సాగు నీరందని దుస్థితి

అన్నిప్రాంతాల్లోనూ ప్రధాన కాలువలతోపాటు పంటకాలువల్లో గుర్రపుడెక్క, తూటి కాడ, నాచు మరింతగా పెరిగి కాలువల్లో సాగునీటితోపాటు మురికినీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కాలువల ఆధునికీకరణ పనులు పూర్తిచేయకపోతే ఖరీఫ్‌లో పంటలకు సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి ఉండదని, పనులు పూర్తి చేయాలని రైతులు అటు అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. కాలువలకు నీటిని విడుదల చేసినందున కనీసం ఏదైనా మందు స్ప్రేచేసి గుర్రపుడెక్క, తూటికాడలను తొలగించి, సాగునీరు సక్రమంగా పారేలా చేయాలని, ఇప్పటికైనా ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపక్షం నిరసననూ పట్టించుకోని ప్రభుత్వం



గంగోలు కాలువలో దిగి నిరసన తెలిపిన వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబు

జిల్లాలోని కృష్ణా పంటకాలువల్లో వున్న గుర్రపు డెక్క, తూటికాడలను తొలగించి తరలించి పంటలకు సాగునీరు అందేలా తక్షణం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు గత శనివారం భట్టిప్రోలు మండలంలోని గంగోలు కాలువ పరిధిలోని కనగాల–గూడవల్లి కాలువలో దిగి ప్రత్యక్ష ఆందోళన చేపట్టారు. మూడు కి.మీ.మేరవున్న కాలువలోని పూడికను తొలగించాలని డిమాండ్ చేశారు. అయినా అధికారులు ఇంతవరకు స్పందించలేదు.

ఆయకట్టుకు సాగునీరందేనా?

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2 లక్షలకు పైగా ఎకరాల్లో వరిపంట సాగు కానుండగా .. సింహభాగం రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో సాగవుతుంది. కానీ ఈ ప్రాంతంలోని పంటకాలువల ఆధునికీకరణ పనులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. గత ఏడాది జిల్లాలో 2,16,434 ఎకరాల్లో వరిపంట సాగు కాగా.. అత్యధికంగా రేపల్లె వ్యవసాయ డివిజన్‌లో 1,45,766 ఎకరాల్లో సాగైంది. బాపట్ల డివిజన్ పరిధిలో 51,613 ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేశారు.




బాపట్ల మరుప్రోలు వారిపాలెం డ్రెయిన్ ఇలా..

హ్యాండ్ ఇచ్చారు!

హ్యాండ్‌లూమ్‌కు కూటమి రిక్తహస్తం

- 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలేది?
- నేతన్నలకు అందించే రూ.24 వేలు ఊసేలేదు
- హామీల వర్షం.. అమలు శూన్యం
- ఆగ్రహంగా ఉన్న చేనేత కుటుంబాలు



చీరాలలో మూలకు చేరిన మగ్గాలు

చీరాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే హ్యాండ్‌లూమ్, పవర్‌లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని నేతన్నలు ఆశించారు. కానీ అధికారం చేపట్టిన ఏడాది గడిచినా ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలుకాలేదు. పెరిగిన విద్యుత్ చార్జీలతో చేనేత కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉచిత విద్యుత్‌కు జీఓ విడుదల చేసినా.. అది అమలుకు నోచుకోకపోవడంతో తమ జీవితాలు ఇంతే అంటూ నిట్టూరుస్తున్నారు. వ్యవసాయ రంగం తర్వాత అంతటి ప్రాధాన్యం ఉన్న చేనేత రంగం రోజురోజుకు కుదేలవుతోంది.

ఉచిత విద్యుత్ హుళక్కే!

జిల్లాలో చేనేత రంగాన్ని నమ్ముకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది జీవనం పొందుతున్నారు. అయితే చేనేతలకు అందిస్తామని చెప్పిన ఏ పథకం వారి దరికి చేరడం లేదు. చేనేతకు ఉచిత విద్యుత్ అందిస్తామని కూటమి పెద్దలు ప్రగల్భాలు పలికారు. మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ నేటికీ ఆ హామీ అమలు కాలేదు. దీంతో బతుకు భారమైనా జీవిత రాట్నాన్ని నెట్టుకు వస్తున్నారు. జిల్లాలో 33,184 వరకు మగ్గాలు ఉండగా, 24వేల చేనేత కుటుంబాలు వరకు ఉన్నాయి. వీరిలో 50 వేల మంది వరకు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని జీఓలో స్పష్టం చేశారు. అయితే ఇందులో మరో మెలిక పెట్టింది ప్రభుత్వం. డిస్కం సంస్థలు ఇంధన శాఖకు తగిన బడ్జెట్ మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అయితే జీఓ విడుదలై నెలలు కావస్తున్నా బడ్జెట్ విడుదల కాకపోవడంతో నేతన్నలు పెదవి విరుస్తున్నారు. పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులు అందుకుంటూ నేతన్నలు తలలు పట్టుకుంటున్నారు.

నాడు 'నేస్త'మై నిలిచి..

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలు అర్హులైన ప్రతి నేత కార్మికుడికి నేతన్న నేస్తం కింద సంవత్సరానికి రూ.24 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసింది. అంతేకాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసలు యూజర్ చార్జీలను తగ్గించే వెసులుబాటు కల్పించింది. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు నేతన్నలకు హామీలను గుప్పించగా.. ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు.

ఒక్క హామీ అమలైతే ఒట్టు!

- చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపుపై నేటికీ కూటమి సర్కారు ఎలాంటి ప్రకటన చేయలేదు.
- చేనేత దినోత్సవం రోజున విజయవాడలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ చేనేతపై జీఎస్టీ ఎత్తివేస్తామని, లేదంటే రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పారు. అతీగతీ లేదు.
- చేనేతలు అధికంగా ఉన్న చీరాల ప్రాంతంలో చేనేత పార్కు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు చీరాల వచ్చిన సందర్భంగా చెప్పారు. 50 ఎకరాలలో హ్యాండ్‌లూమ్ పార్కు ఏర్పాటు చేస్తామని నమ్మబలికారు. నేటికి ఆ ఊసే లేకుండా పోయింది.
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాల మండలం జాండ్రపేటలో నిర్వహించిన సదస్సుకు ఆ శాఖా మంత్రి సవిత హాజరై కేవలం చేనేతల కోసం అనేక పథకాలు రచించామని చెప్పారే తప్ప అమలుపై ఒక్క మాటా మాట్లాడకపోవడం శోచనీయం.
- మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా సమస్యలల్లో కొట్టుమిట్టాడుతున్న చేనేత పరిశ్రమపై జీఎస్టీ పెనుభారంగా మారింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేనేత పరిశ్రమపై జీఎస్టీ వేయడంతో మరింత సంక్షోభంలో కూరుకుపోయింది. చేనేత వృత్తులు చేసే వారికి 29 శాతం జీఎస్టీ మినహాయింపు ఇస్తామని చెప్పినా అమలయ్యేలా లేదు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

- రూ. 10.37 లక్షలు విలువచేసే సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్‌నాయక్



చోరీ సొత్తుతో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్‌నాయక్

బాపట్లటౌన్: రెప్పపాటులో సొమ్ము, నగలు, వస్తువులు స్వాహా చేసే ఘరానా దొంగను ఎట్టకేలకు సీసీఎస్ పోలీసులు అరెస్టుచేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.10.37 లక్షల విలువచేసే సొమ్మును రికవరీ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ వివరాలను వెల్లడించారు. బాపట్ల మండలం, మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం జగదీష్ నర్సింగ్ పూర్తిచేసి ఉద్యోగం రాకపోవడంతో పొలం పనులకు వెళుతూ జీవనం సాగిస్తుండేవాడు. జల్సాలకు అలవాటిన జగదీష్.. పొలం పనుల ద్వారా వచ్చే సొమ్ము జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడడం అలవాటుగా మార్చుకున్నాడు. బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ రూ.లక్షల విలువ చేసే బంగారం, టీవీలు, ల్యాప్‌ట్యాప్‌లు దొంగతనాలను పాల్పడుతున్నాడు. అతని కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టిన సీసీఎస్ పోలీసులు సోమవారం ఉదయం చాకచక్యంగా అదుపులోకి తీసుకొని అరెస్టుచేశారు.

వరుస దొంగతనాలు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం, భుషాయపాలెంలోని ఓ గృహంలో రూ. 15 వేలు విలువచేసే శామ్‌సంగ్ ఎల్ఈడీ టీవీ, వీవో సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులను నిందితుడు దొంగిలించాడు.

- పర్చూరు మండలం, కొమరనేనివారిపాలెం గ్రామంలోని ఓ గృహంలో నల్లపూసల దండ, 2 ఉంగరాలు, లాకెట్, వీయూ ఎల్ఈడీ టీవీ
- బాపట్ల మండలం, పూండ్ల గ్రామంలోని ఇంటిలో బంగారం చైన్, సెల్‌ఫోన్

రూ. 10.37 లక్షల విలువచేసే సొమ్ము రికవరీ

నిందితుడి వద్ద నుంచి రూ. 6.50 లక్షల విలువ కలిగిన బంగారపు నగలు, రూ. 1.20 లక్షల విలువ కలిగిన 10 సెల్‌ఫోన్లు, రూ.1.20 లక్షల విలువ కలిగిన 3 ల్యాప్‌టాప్‌లు, రూ. 30 వేల విలువ కలిగిన ట్యాబ్, రూ. 80 వేల విలువ కలిగిన ఎల్ఈడీ టీవీలు, రూ. 7 వేల విలువ కలిగిన కలర్ ప్రింటర్, రూ. 30 వేలు విలువ కలిగిన హెచ్‌పీ కంపెనీ కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

- గుంటూరు జిల్లా కాకుమాను మండలం, పాండ్రపాడు గ్రామంలోని ఓ గృహంలో బంగారం చైన్, రూ.8 వేలు నగదు, మొబైల్.
- కాకుమాను మండలం, కొమ్మూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, హెల్త్‌సెంటర్‌లో కంప్యూటర్, ప్రింటర్.
- గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండల పరిధిలో రెండు ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు.

సిబ్బందికి ఎస్పీ అభినందన

కేసుల ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్య, సీసీఎస్ ఎస్ఐ స్వర్ణ రవిప్రకాష్, సీసీఎస్ ఎస్ఐ బి.రాంబాబు, సీసీఎస్ కానిస్టేబుళ్లు ఎస్.కోటేశ్వర రెడ్డి, డి.వై.దాసు, కె.చిరంజీవి, ఆర్. వెంకట కృష్ణలను ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.

శుభకరం.. శ్రావణం

- ఆధ్యాత్మికతకు ఆలవాలం
- ఈ నెల 26 నుంచి శ్రావణమాసం ఆరంభం
- మెండుగా శుభ ముహూర్తాలు
- కళకళలాడనున్న కల్యాణ వేదికలు, వ్యాపారాలు



అద్దంకిలో ముస్తాబైన కల్యాణ మండపం

అద్దంకి: వివాహాది శుభముహూర్తాలకు, పండుగలకు, వరలక్ష్మి వ్రతాలకు శ్రావణ మాసం శుభసూచికం. ఈ నెల 26 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండగా.. మెండుగా శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈక్రమంలో వస్త్ర, నగలు, కిరాణాతోపాటు వివిధ రకాల వ్యాపారాలు కళకళలాడనున్నాయి. క్యాటరింగ్, ఆర్కెస్ట్రా, బ్యాండ్ బాజాలు, డీజేలకు గిరాకీ పెరగనుంది. కల్యాణ మండపాలు ఇప్పటికే బుక్ అవ్వడం గమనార్హం.

శ్రావణం అంటే..

శ్రావణమాసానికి నభో మాసం అనే పేరు కూడా ఉంది. ఆరోగ్యదాయకమైన మాసం అని అర్థమని పండితులు చెబుతారు. చంద్రుడు శ్రవణా నక్షత్రంతో కలిసిన నెలను శ్రావణ మాసం అంటారు. శ్రావణ మాసం విశిష్టత గురించి స్కంధ పురాణంలో రాయబడింది.

పండుగలు

కృష్ణ జన్మాష్టమి, రక్షాబంధన్, నార్యల్ పూర్ణిమ, నాగ పంచమి, బసవ పంచమి, అవని అవిట్టం, బలరామ జయంతి, గంగా పూర్ణిమ, కజారి పూర్ణిమి, పవిత్రోపన, పవిత్ర ఏకాదశి, జంధ్యాల పూర్ణిమ, సలోనో, పోలా, శ్రావణిమేళా, హయగ్రీవ జయంతి, తదితర పండుగలతోపాటు, శ్రావణ శుక్రవారవ్రతాలు, విశిష్టమైన వరలక్ష్మి వ్రతం పండుగలు ఉన్నాయి.

మెండుగా మహుర్తాలు..



శ్రావణ మాసం సకల శుభకరం. ఈ నెలలో వ్రతాలు, పండుగలు ఉన్నాయి. ఈ నెలలో ముహుర్తాలు కూడా దివ్యంగా ఉన్నాయి. శ్రావణ మాసం ఆధ్యాత్మిక మాసం. శ్రావణ శుక్రవారం, మంగళగౌరీ వ్రతాలను మహిళలు ఆచరిస్తారు.

– స్వర్ణరాంబాబు శర్మ, పురోహితుడు, చెన్నుపల్లి

మంచి ముహుర్తాలు..

శ్రావణ మాసం మొదలైన మొదటి రోజు నుంచి ముహర్తాలు మొదలు కానున్నాయి. ముఖ్యంగా జూలై నెలలో 26, 30, 31, ఆగస్టులో 1,3,5,6,7, 8, 9, 12, 13, 14, 17, అక్టోబరులో 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16,17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబరు నెలలో 1,2,4,7, 12, 13, 14,15, 22, 123, 25, 26, 27 తేదీల్లో ముహుర్తాలు ఉన్నాయని పురోహితులు చెప్తున్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే బాధితులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 191 అర్జీలను అధికారులు స్వీకరించారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని ఆయా శాఖల అధికారులకు పురమాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వారంలో ఒక లక్ష ఫైల్స్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పీ–4 అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పరిశీలనకు వెళ్లే సమయంలో గ్రామ కమిటీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. అర్హులైన బంగారు కుటుంబాలు, మార్గదర్శిలు సరైన వారేనా, నీడ్ బేస్డ్ సర్వే సక్రమంగా జరుగుతుందా లేదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అనర్హులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని తొలగించాలని ఆదేశించారు. పి–4 విధానంలో సవరణ ప్రక్రియకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సూర్య ఘర్, స్వచ్ఛతాహి కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. రెండు రోజుల ముందుగానే ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపాలన్నారు. ప్రోటోకాల్ అమలు తీరులో సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో భాగంగా 2024 డిసెంబర్‌లో జరిగిన పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోగా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ వివరాలను www.schoarships.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసి దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. విద్యార్థి తన వివరాలలో ఏ ఒక్క అక్షరం తేడాగా నమోదు చేసినా స్కాలర్‌షిప్ మంజూరు కాదని స్పష్టం చేశారు. మెరిట్ లిస్టులో ఉన్న విధంగా ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేసిన దరఖాస్తును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు. ఈఏడాది 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రెన్యువల్ చేయని విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాదని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత, రసాయనశాస్త్ర అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధించి సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు పొంది ఉండాలని, ఎంపిక ప్రక్రియ డెమో ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 26న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

వైద్య అధికారులతో డీఎంహెచ్ఓ సమావేశం



గుంటూరు మెడికల్: డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన గుంటూరు జిల్లాలో ఏప్రిల్ 25 – జూన్ 25 వరకు జరిగిన 8 శిశు, చంటి పిల్లల మరణాలపై రివ్యూ కమిటీ సమావేశం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. మరణాలకు కారణాలు, అందించిన వైద్య సేవలు, గృహ సందర్శనలు వివరాలపై చర్చించారు. గుంటూరు నగరంలోని బొంగరాలబీడు, మారుతీనగర్, పొన్నెకల్లు ఆరోగ్యకేంద్రాల పరిధిలో నమోదైన కేసులపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు డాక్టర్ దేవకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ సభ్యులు డాక్టర్ ఎస్.రాధామాధవి, డాక్టర్ రోహిణి రత్నశ్రీ , ఈఓఐసీడీఎస్ సుబ్బమ్మ, ఐద్వా ఎన్జీఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా వరదనీరు విడుదల

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురియడంతో పలు వాగుల నుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరింది. సోమవారం సాయంత్రం స్వల్పంగా వరదనీటిని ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజ్ జేఈ రమేష్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ వద్దకు మునేరు ఇతర వాగుల నుంచి 5,300 క్యూసెక్కులు చేరిందని, ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిమట్టాన్ని 12 అడుగులు మెయింటెన్ చేస్తూ విజయవాడ వైపు ఒక అడుగు మేర 4 గేట్లు ఎత్తి కృష్ణానది దిగువకు 2900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని తెలిపారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 2522 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన తెలిపారు.

కందకంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



తాడికొండ: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కందకంలోకి దూసుకెళ్లిన ఘటన తాడికొండ శివారు పెదపరిమి రోడ్డులో జరిగింది. సోమవారం మధ్యాహ్నం సుమారు 30 మంది ప్రయాణికులతో గుంటూరు వైపు నుంచి తుళ్ళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు తాడికొండ దాటిన తరువాత కందకంలోకి దూసుకెళ్లింది. ఇద్దరు మహిళలతోపాటు పలువురు పురుషులకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ దూకుడుగా నడిపాడని, చిన్నగా వెళ్లాలని హెచ్చరించినా పెడచెవిన పెట్టడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోయారు.

క్లుప్తంగా

చెల్లని చెక్కు కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు అవడంతో దిగువ కోర్టు విధించిన 18 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.25 లక్షలు ఫిర్యాదుదారుడికి నష్టపరిహారంగా చెల్లించేలా విధించిన శిక్షను యథాతథంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.సత్యశ్రీ సోమవారం తీర్పు వెలువరించారు. పట్టణానికి చెందిన నిందితుడు శ్రీనివాసరావు 2013 ఫిబ్రవరి 27న నాగేశ్వరరావు వద్ద రూ.25 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. దీనికి ప్రామిసరీ నోటురాసి ఇచ్చాడు. చెల్లింపులో భాగంగా 2017 మే 5న రూ.25 లక్షలకు చెక్కు ఇచ్చాడు. నాగేశ్వరరావు చెక్కు తన బ్యాంక్ ఖాతాలో వేసుకున్నాడు. అది చెల్లలేదు.

ఈ మేరకు ఆయన కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువడంతో 2021 జనవరి 20న దిగువ కోర్టు పైవిధంగా తీర్పు వెలువరించింది. నిందితుడు శ్రీనివాసరావు జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకున్నాడు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువ కోర్టు తీర్పును యథాతథంగా ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

జిల్లాలో 798.8 మిల్లీమీటర్ల వర్షం

అత్యధికంగా దుర్గిలో 89.0 మి.మీ

నరసరావుపేట: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24గంటల వ్యవధిలో పల్నాడు జిల్లాలో 798.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలియచేశారు. అత్యధికంగా దుర్గి మండలంలో 89.0మి.మీ వర్షం పడగా అత్యల్పంగా మాచవరంలో 4.2 వర్షం పడింది. మండలాల వారీగా పరిశీలిస్తే...మాచర్ల 46.0, వెల్దుర్తి 4.6, రెంటచింత 21.2, గురజాల 6.2, దాచేపల్లి 9.2, కారంపూడి 8.6, పిడుగురాళ్ల 19.2, బెల్లంకొండ 36.6, అచ్చంపేట 10.2, క్రోసూరు 39.8, అమరావతి 45.2, పెదకూరపాడు 35.2, సత్తెనపల్లి 38.2, రాజుపాలెం 42.8, నకరికల్లు 15.4, బొల్లాపల్లి 8.6, వినుకొండ 19.6, నూజెండ్ల 17.6, శావల్యాపురం 16.2, ఈపూరు 18.2, రొంపిచర్ల 47.2, నరసరావుపేట 51.2, ముప్పాళ్ల 36.4, నాదెండ్ల 55.4, చిలకలూరిపేట 39.2, యడ్లపాడు 17.6 మి.మీ వర్షం కురిసింది.

చిన్నారి చేతులపై వాతలు పెట్టిన నాయనమ్మపై కేసు

పట్నంబజారు: మనవడి చేతులు కాల్చిన నాయనమ్మపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో నివాసం ఉండే జయలక్ష్మికి ముగ్గురు కుమారులు. ఆఖరి కుమారుడు సాయివీరప్రసాద్‌కు వివాహమైంది. ఇతనికి ఒక కుమార్తె, 18 నెలల కుమారుడు ఆజాద్ మురగన్ ఉన్నారు. ఈ నెల 17వ తేదీన పిల్లల్ని చూడాలని వీరప్రసాద్‌కు చెప్పటంతో నానమ్మ ఇంట్లో వదలివెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసే సరికి చిన్నారి రెండు చేతులు కాలి ఉన్నాయి. వాటర్ హీటర్ కాలిందని అబద్ధం చెప్పటంతో చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చేతులు స్పష్టంగా కాల్చినట్లు గుర్తించారు. ఆజాద్‌మురగన్ పుట్టిన కొద్దిరోజులకే అతని పెద నాన్న మృతి చెందాడు. అప్పటి నుంచి అత్తాకోడలు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో వారు వేరుగా ఉంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నాయనమ్మ ఈ దారుణానికి పాల్పడిందని పోలీసులు గుర్తించారు. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు భవితకు నవోదయం

- ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వరం
- జేఎన్‌వీలో ఆరో తరగతి ప్రవేశాలకు ఆహ్వానం
- 29 వరకు దరఖాస్తు దాఖలుకు గడువు
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



మద్దిరాలలోని పీఎంశ్రీ జేఎన్‌వీ

చిలకలూరిపేట టౌన్ / యడ్లపాడు: ప్రతిభావంతులైన పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు చక్కని అవకాశం కల్పిస్తోంది పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం. చిలకలూరిపేట రూరల్ మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది వేసే పాఠశాల విద్యలో జవహర్ నవోదయ విద్యాలయాలు మంచి విద్యా ప్రమాణాలను ఉచితంగా అందిస్తున్నాయి. పాఠశాలలో ఆరో తరగతిలో 80 సీట్లు ఉంటాయి. ప్రతిభావంతులైన విద్యార్థులను మాత్రమే వీటికి ఎంపిక చేస్తారు. ఇందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఏటా ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చును వెచ్చిస్తుంది. జూన్ 1న ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఈ నెల 29వ తేదీతో దరఖాస్తు దాఖలుకు గడువు ముగియనుంది.

సీబీఎస్‌ఈ సిలబస్...

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు 6 నుంచి 12వ తరగతి వరకు ఎటువంటి ఖర్చు లేకుండా కో రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా సీబీఎస్‌ఈ సిలబస్‌లో విద్యను అభ్యసించవచ్చు.

సకల సౌకర్యాలు...

భోజనం, వసతి, దుస్తులు, పుస్తకాలు వంటివి అందజేస్తారు. బాలురు, బాలికల కోసం వేర్వేరు వసతి గృహాలున్నాయి. సువిశాల ప్రాంగణం, శాశ్వత తరగతి గదులు, డిజిటల్ పాఠాలకు ప్రత్యేక ఏర్పాట్లు, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, రన్నింగ్ ట్రాక్, మైదానం ఉన్నాయి. ఉదయం వ్యాయామం, యోగా సాధన, చిత్రలేఖనం, సంగీతం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్ అండ్ గైడ్, పలు క్రీడల్లో శిక్షణ ఇస్తారు. పాఠ్యాంశాలతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కూడా ఎన్నో పుస్తకాలతో కూడిన గ్రంథాలయం, పూర్తిగా సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుంది. ముఖ్యంగా జేఈఈ, నీట్‌కు కూడా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారు. జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేలా మైగ్రేషన్ (వలస) స్కీమ్ ద్వారా ఇక్కడ 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఇతర రాష్ట్రాల నవోదయ విద్యాలయాలకు పంపిస్తారు. దీంతో అక్కడి భాషలు, సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకునే చక్కని అవకాశం లభిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



నవోదయలో అడ్మిషన్లు పూర్తిగా ప్రతిభ ఆధారంగానే జరుగుతాయి. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే 750 అర్జీలు వచ్చాయి. పరీక్ష విధానం, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. ఎలాంటి సిఫార్సులకు తావుండదు. తల్లిదండ్రులు, విద్యార్థులు అపోహలకు లోనవ్వకుండా అప్రమత్తతతో ఉండాలి. 6 నుంచి 12వ తరగతి వరకు ఎలాంటి ఖర్చు లేకుండా విద్యాభ్యాసం సాగించవచ్చు. దరఖాస్తులు గడువులోగా దాఖలు చేయాలి.

– నల్లూరి నరసింహారావు, ప్రిన్సిపాల్, పీఎంశ్రీ జేఎన్‌వీ, మద్దిరాల

అర్హులు వీరే...

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన అడ్మిషన్లు జరుగుతాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ ఉండాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాలలో చదివి ఉత్తీర్ణులైన వారికి ఈ కోటాలో అవకాశం కల్పిస్తారు. విద్యార్థి 2014 మే 1 – 2016 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. తల్లిదండ్రులు ఉమ్మడి గుంటూరు జిల్లా నివాసితులై ఉండాలి. విద్యార్థి కూడా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చదువుకొని ఉండాలి.

పరీక్ష విధానం ఇలా...

విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్//నవోదయ.జీవోవీ.ఇన్‌లో లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష మొత్తం 80 ప్రశ్నలు 100 మార్కులకు నిర్వహిస్తారు. రెండు గంటల సమయం ఉంటుంది. తెలుగు, ఆంగ్లం, హిందీ, మరాఠీ, ఉర్దూ, ఒరియా, కన్నడ మాధ్యమంలో ప్రశ్నాపత్రం ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు కేటాయిస్తారు. ప్రవేశ పరీక్షను అమృతలూరు, బాపట్ల, చిలకలూరిపేట, గుంటూరు, మంగళగిరి, నరసరావుపేట, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, తెనాలి, వినుకొండ, రేపల్లె ప్రాంతాల్లో నిర్వహిస్తారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు

బాపట్ల: గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ అకౌంట్లకు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేశారు. టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను తక్షణం రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీల అభివృద్ధికి ప్రతిబంధకాలు ఉన్న వాటిని తొలగించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక గ్రామపంచాయతీలు నిధులు లేక వేసవికాలంలో ఇబ్బందులు పడి మరల, వర్షాకాల ప్రభావంతో పారిశుద్ధ్య పనులు, సైడ్ కాలువల పూడికతీత, బ్లీచింగ్, జీతభత్యాలు తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. గత డిసెంబర్లో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు పంపినా నేటి వరకు నిధులు గ్రామపంచాయతీలకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. సర్పంచుల గౌరవ వేతనం ను విడుదల చేయాలని, పెంపుదల చేయాలని, గ్రామపంచాయతీలకు రావలసిన రిజిస్ట్రేషన్‌ల సర్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏ.శ్రీనివాసరెడ్డి, మేకతోటి శ్రీకాంత్, బి.అనిల్‌కుమార్, మార్తమ్మ, డి.అంకమ్మ, నాగార్జునరెడ్డి, కిషోర్ తదితరులు ఉన్నారు.

సాంస్కృతిక వికాసానికి పునరంకితం కావాలి

కేఎస్‌టీ శాయి



బాపట్ల: సాహిత్య సాంస్కృతిక రంగాలలో ఉభయ తెలుగు రాష్ట్రాలకే తలమానికమైన బాపట్ల సాంస్కృతిక రంగ పూర్వ వైభవానికి కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ రంగస్థల, చలన చిత్ర నటులు, దర్శకులు, ప్రయోక్త కె.ఎస్.టి.శాయి అన్నారు. స్థానిక జి.ఎస్.ఎన్.టవర్స్‌లో బాపట్ల జిల్లా రచయితల సంఘం నిర్వహించిన ఆత్మీయుల ఆంతరంగిక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అనేకమంది కళాకారులకు జన్మనివ్వడమే కాక పలువురికి ప్రేరణ ఇచ్చి వారిని ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దిన రంగస్థల కళాశాలగా బాపట్లకు దేశ విదేశాలలో చిరస్మరణీయమైన పేరు ఉందని, ఆ ఘనతను పరిరక్షించుకోవలసిన బాధ్యత నేటి తరం కళాకారుల మీద ఉందన్నారు. యువ కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సుదీర్ఘమైన తన రంగస్థలం అనుభవాలను కళాకారులతో ఆయన పంచుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రచయిత తిమ్మన శ్యామ్ సుందర్ మాట్లాడుతూ 77 సంవత్సరాల సుదీర్ఘ రంగస్థలం అనుభవం ఉన్న కె.ఎస్.టి.శాయికి ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించాలని తద్వారా తెలుగు నాటక రంగాన్ని జాతీయస్థాయిలో గౌరవించినట్లు అవుతుందన్నారు. నటరాజు విగ్రహానికి పుష్పాభిషేకంతో ప్రారంభించబడిన ఈ కార్యక్రమంలో పెనుమెత్స నాగరాజు, గుంట్రెడ్డి సత్యనారాయణ, ఆకురాతి మురళీకృష్ణ, అంబటి మురళీకృష్ణ, శిట్లా సీతారాం, కళ్లం హరినాథ రెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, బూరుగుల సంగమేశ్వర శాస్త్రి, జి. శాంతారామ్, డబ్ల్యూ.ఏ.జీ.కే.మూర్తి, షేక్ బాబా వలి తదితరుల మరియు బాపట్లకు చెందిన సాహిత్య సాంస్కృతిక సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొని కె.ఎస్.టి.శాయిని సన్మానించారు. కార్యక్రమాన్ని నందిరాజు విజయకుమార్ నిర్వహించారు.

వివాహిత అనుమానాస్పద మృతి


మృతి చెందిన పఠాన్ మీరాబీ

మార్టూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని బబ్బేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం విప్పర్ల గ్రామానికి చెందిన పఠాన్ మీరాబీ (25)కి బబ్బేపల్లికి చెందిన పఠాన్ కరీముల్లాతో నాలుగు నెలల కిందట వివాహం జరిగింది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మీరాబీ బబ్బేపల్లి గ్రామంలోనే ఉంటున్న తన అక్క ఇంట్లో వారం రోజులుగా ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కరీముల్లా మీరాబి అక్క నివాసానికి వెళ్లి తన భార్యను సరిగ్గా చూసుకుంటానని నమ్మించి ఇంటికి తీసుకువచ్చాడు. అనంతరం మార్టూరులోని గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో జరిగిన ఓ ఫంక్షన్‌కు ఇద్దరూ హాజరై తిరిగి వచ్చారు. అనంతరం భార్యాభర్తల మధ్య గొడవ జరగగా కరీముల్లా కొంతసేపటికి ఇంటికి తలుపు వేసి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 6 గంటల ఇంటికి వచ్చి తలుపు తీసి చూసిన మీరాబీ తమ్ముడు అచేతనంగా నేలపై పడి ఉన్న అక్కను చూసి కేకలు వేసి స్థానికులను పిలిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు మీరాబి మృతి చెందిందని గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం నిందితుడు కరీముల్లాను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా తన భార్య మీరాబీని తనే హత్య చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన నరసింహారావు

మార్టూరు: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన సోమవారం మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన తొట్టెంపూడి నరసింహారావు (40)కు ఆయన భార్యకు మధ్య వారం రోజులుగా సమీప గ్రామానికి చెందిన ఓ మహిళ విషయంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నరసింహారావు ఆదివారం రాత్రి బొల్లాపల్లి సాగర్ కాలువ గట్టుపై గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు వారి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. దీంతోపాటు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మార్టూరులో సోమవారం సాయంత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీ సమీపంలోని పొలాల్లో సుమారు 45 సంవత్సరాల వయసు గల పురుషుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించిన పోలీసులు మృతుడు ఇతర రాష్ట్రాలకు చెందిన గ్రానైట్ కార్మికునిగా భావించి ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం సమీపంలో పడి ఉన్న మూడు ఖాళీ బీరు సీసాలను గుర్తించిన పోలీసులు అతిగా మద్యం సేవించి దాహార్తి కారణంగా మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బ్యాడ్మింటన్ పోటీలో పతకాలు



నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పట్టణానికి చెందిన ఎస్‌కేఆర్‌బీఆర్ ఇండోర్ స్టేడియం బ్యాడ్మింటన్ క్రీడాకారులు పతకాలు సాధించినట్లు కోచ్ డాక్టర్ వి.శరత్‌చందు సోమవారం తెలిపారు. గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 19, 20వ తేదీలలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన 52వ గుంటూరు జిల్లా స్థాయి పోటీలలో అండర్–11 విభాగంలో తమ క్రీడాకారులు బి.దినేష్‌రెడ్డి, వేదవచన్, అండర్–13 బాలికల విభాగంలో కె.చార్వి, షేక్ అఫ్రిన్, అండర్–15 విభాగంలో షేక్ సానియాలు ద్వితీయ స్థానాలు సాధించారని వివరించారు. క్రీడాకారులను ఇండోర్ స్టేడియం చైర్మన్, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డైరెక్టర్ కె.వి.పురుషోత్తమరావు, అసిస్టెంట్ కోచ్‌లు ఎ.సాయి, షేక్ నసీమా అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలంలోని కుదిరి వద్ద రోడ్డు ప్రమాదంలో తెనాలి ప్రాంతానికి చెందిన వంశీ(24) మృతి చెందిన విషయంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై బ్రహ్మనాయుడు సమాచారం మేరకు తెనాలి సమీపంలోని కొల్లూరు ప్రాంతానికి చెందిన వంశీ(24) శ్రీ సిటీలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. తోటి ఉద్యోగులతో కలిసి పులికాట్‌ను సందర్శించి ఆదివారం రాత్రి సూళ్లూరుపేటకు స్కూటీపై తిరిగి వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షలు కోసం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కొప్పుల కోటయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ


కోటయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేరుగ నాగార్జున, డాక్టర్ గణేష్

నగరం: మండలంలోని సజ్జావారిపాలెం శివారు అల్లపర్రు అగ్రహారానికి చెందిన కొప్పుల కోటయ్య కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున, పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌లు పరామర్శించారు. ఇటీవల కోటయ్య మృతిచెండటంతో పెదకర్మ కార్యక్రమం అల్లపర్రు అగ్రహారంలో సోమవారం నిర్వహించారు. తొలుత కోటయ్య చిత్రపటానికి మేరుగ నాగార్జున, గణేష్‌లు పూలు వేసి నివాళులర్పించారు. నగరం, రేపల్లె, చెరుకుపల్లి మండలాల కన్వీనర్‌లు ఇంకోల్లు రామకృష్ణ, కరేటి శేషగిరిరావు, దుండి వెంకటరామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, కృష్ణారెడ్డి, నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, డాక్టర్ రాజా, వీరేంద్ర, ఖాతర్ వలి, చిమటా బాలాజీ పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌కు ఖండన


సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు, కార్యకర్తలు

- చంద్రబాబు పతనానికి ఇది నాంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ, ఎస్సీ సెల్ నాయకులు
- మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించిన నాయకులు

నరసరావుపేట రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తున్న నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా జగనన్నకు తోడుగా నిలుస్తామని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సిద్దారపు గాంధీ తెలిపారు. పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీసీ, ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శామ్యూల్, ఇంగ్లిష్ మీడియం విద్య పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ చాదినబోయిన ఏడుకొండలు యాదవ్, గాంధీ స్మారక సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈదర గోపీచంద్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, నరసరావుపేట నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, గురజాల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచర్ల బాబు, బీసీ నాయకుడు అట్లూరి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అన్యాయాలపై మాట్లాడుతున్న వారి గొంతు నొక్కడమే ధ్యేయంగా అక్రమ కేసులు బనాయిస్తోందని తెలిపారు. అక్రమ కేసులతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేదన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుల మీద కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు తన పతనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నాడని ఈదర గోపీచంద్ విమర్శించారు. గత ఎన్నికల్లో అక్రమమార్గంలో ఈవీఎంల ద్వారా గెలిచారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో ఈవీఎంల మోసాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. శామ్యూల్ మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో దాడులు, అక్రమ కేసులు కూటమి ప్రభుత్వం పాల్పడుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే మిథున్ రెడ్డిని అరెస్ట్ చేసారని పేర్కొన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడేది లేదని తెలిపారు.

ఏఎన్‌యూ విద్యార్థికి జపాన్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం


ఆహ్వాన పత్రాన్ని విద్యార్థి వి.అవినాష్‌కు అందజేస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యు): జపాన్ దేశంలోని క్యోటో యూనివర్సిటీలో ఫెలోషిప్ కింద అధ్యయనం చేసేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎంఎస్సీ ఫారెస్ట్రీ కోర్సు విద్యార్థి వి అవినాష్‌కు అవకాశం లభించింది. ఈ మేరకు జపాన్ యూనివర్సిటీ నుండి ఏఎన్‌యూకి అధికారికంగా ఆహ్వానపత్రం అందింది. ఈ ఆహ్వాన పత్రాన్ని వీసీ ఆచార్య కె గంగాధరరావు సోమవారం విద్యార్థి వి అవినాష్‌కు అందజేశారు. అవినాష్ మూడు నెలలపాటు జపాన్ క్యోటో యూనివర్సిటీలో ప్రొఫెసర్ యోసుకే ఒనాడ కింద ఫెలోషిప్‌లో భాగంగా ఫారెస్ట్ ఎకాలజీ ల్యాబొరేట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో పనిచేయనున్నారు. దీనిలో భాగంగా ఫారెస్ట్ ప్రొడెక్టివిటీ ఎకోసిస్టమ్ ప్రాసెస్ తదితర అంశాల మీద పరిశోధన చేయనున్నారు. జపాన్ యూనివర్సిటీలో మంచి అధ్యయనం చేసి అంతర్జాతీయ ఖ్యాతి గడించాలని అవినాష్‌కు విసి సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్రీ కోర్సు విభాగాధిపతి ఆచార్య కె మల్లికార్జున, అధ్యాపకులు డాక్టర్ మిధున్‌కుమార్, డాక్టర్ ఆర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు వడ్డేశ్వరం బాలికలు

తాడేపల్లి రూరల్: ఆగస్టులో జరగున్న జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బాలికలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అమ్యెచూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన సబ్ జూనియర్ కేటగిరిలో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్‌కె నస్రీన్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లై లలో మొదటి స్థానం, 100 మీటర్ల బటర్ ఫ్లైలో ద్వితీయ స్థానంలో, 200 మీటర్ల పాడ్యవల్ మెడ్లేలో మూడవ స్థానంలో నిలిచిందని తెలిపారు. నస్రీన్ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో మొదటి స్థానంలో నిలిచి ఆగస్టు 4,5 తేదీల్లో బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.జోజప్ప, వ్యాయామ శిక్షకులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, విజయకుమారి తదితరులు అభినందించారు.

సీపీఐ గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- మహాసభల పోస్టర్ ఆవిష్కరణ
- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నాయకులు

లక్ష్మీపురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుంటూరు జిల్లా 26వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయం (మల్లయ్య లింగం భవన్)లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలు ఆగస్టు 4,5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు బీఆర్ స్టేడియం నుంచి గాంధీ పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సహా రాష్ట్ర, జిల్లా పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. 5న ప్రతినిధుల సభను మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో పార్టీ చేపట్టిన కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు. అనంతరం మహాసభల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, పచ్చల శివాజీ, బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి తదితరులు పాల్గొన్నారు.